# 20. శ్మశాన సుందరి

ఉద్యోగమూ, సంసారమూ లేకపోవటంవల్ల- కాలం వెళ్లబుచ్చేందుకు - ఏ పెద్ద ప్రభుత్వోద్యోగిలాగో పారిస్‌వీధుల్లో తిరుగుతూండటం అలవాటైంది. రకరకాల ప్రజల్నీ, వింతవింత సంఘటనలన్నీ గమనిస్తూండేవాణ్ణి. సెప్టెంబరు నెలలో - ఒకనాటి మధ్యాహ్నం ఏ ప్రత్యేకమైన పనీ లేకుండానే బయలుదేరాను. సామాన్యంగా నాలాగు ఊరంతా గాలించేవాడు - ఏపరిచయస్థుల ఇళ్ళదగ్గరో కొంతకాలం గడుపుతూంటాడు; అంటే - తన ప్రియురాళ్ళనూ, స్నేహితురాళ్ళనూ వరసాగ్గా ఒక్కొక్కరిగా జ్ఞాపకం చేసుకొని, వారి సౌందర్యాన్ని మనస్సులో తూచుకొని, తనకు ఎక్కువ ఆనందం ఏ స్థలాన కలుగుతుందో - అక్కడికి వెళ్తాడు. కాని ఎండ బాగా కాస్తూ గాలిహాయిగా వీస్తున్ననాడు ఇలాటి కోరికే కలగదు.

ఆనాటి వాతావరణం చాలా ఉత్సాహకరంగా వుంది. చుట్ట ముట్టించి, ఊరి బైటి దాకా, నాకు తెలియకుండానే నడిచాను. చప్పున నాకు చర్చి వైపు వెళ్దా మనిపించింది. నాకు చర్చిని ఆవరించి వుండే శ్మశానమంటే - గొప్ప ఇష్టం. ఆ ప్రదేశం నిశ్శబ్దంగా ఏడుస్తూ కలిగించే బాధే నాకు బాగుంటుంది. నా స్నేహితుల్లో కొంత మంది మళ్లీ యీ కంటికి కనపడకుండా - అక్కడ భూమిలో హాయిగా మెలకువరాని నిద్రలో ఉన్నారు. వారికోసమని నేను అప్పుడప్పుడు అటు వెళ్తూంటాను. విశేషించి ఆ శ్మశానంలోనే నా హృదయంలో గొప్ప స్థానాన్ని సంపాయించుకోగలిగిన ఒక అందమైన యువతీ, ఆమెతోపాటే ఒక గొప్ప ప్రణయగాథా - భూస్థాపన చేయబడినయ్. ఆమె ఇంకా నా మనశ్శాంతిని భంగపరుస్తూ, నన్ను తన కోసం

ఏడిపిస్తూండేది. ఆమెకు యీ లోకంలోని ఏ విషయంతోనూ సంబంధం లేకపోయినా, అప్పుడప్పుడు నేను మాత్రం ఆమె సమాధిని దర్శించి బాధపడుతూండేవాణ్ని.

నా దృష్టిలో శ్మశానానికి ఇంకో ప్రాముఖ్యత కూడా వుంది. ఆ కొద్ది భూమిలోనూ అనాది నుంచీ పాతి పెట్టబడ్డవాళ్ళ సంఖ్యను మనం ఊహించలేం; ఇంత శబ్దాన్ని చేస్తూ, బైట తిరుగులాడే యీ కాస్త ప్రజా - యీ మూధులు - ఇంత పెద్ద పారిస్ పట్టణం చాలక బాధ పడుతూంటే - ఈ పట్టణంలో అనేక శతాబ్దాల వెనుకనుంచీ నివసించిన అనేక మంది ప్రజలు ఏ శబ్దమూ చెయ్యకుండా- ఆ కొద్ది గుహలోనూ హాయిగా పడుకొని నెత్తిమీద క్రాస్‌మార్క్ వేయబడ్డ ఒక్క రాయితో తృప్తిపడుతూ - యీ కాలానికి కాలం వచ్చేదాకా నివసించ గలుగుతున్నారు! అదీకాక మ్యూజియంలోని పురాతనపు వస్తువుల్ని చూసినప్పుడు కలిగే ఆనందంలాటిదే, యీ సమాధుల్ని చూస్తే కలుగుతుంది. ఈ రెండింటి సంబంధమూ లేకుండానే - ఆ సమాధులు నాలో కలిగించే పారవశ్యం - ఆధునిక కళలోని వాస్తవికతకు చాలా దగ్గరిలో ఉంటుంది... ఎవరు నిర్మించినవో - ఎవరికి - ఎంత గొప్పగా బతికినవారికి నిర్మించినవో ఇన్ని సమాధులు! కళను కాళ్ళతో తన్నగలిగిన మహానుభావుల సమాధులు - చూసే దిక్కులేక కాలక్రమాన నశించి మట్టిలో కలిసిపోతున్నయ్.

ఇలాటి భావాల్తోనే శ్మశానం ప్రవేశించాను. ఏదో ఏడ్పు - మనసు మరీ కుంగదీయలేని ఏడ్పు వినిపించినట్టయింది. 'ఇది నిజంగా వేడుకస్థలం కాదు. కాని యీ ఏడ్పుకు నావంతింకా రాలేదు' అనుకున్నాను.

రాలిన ఆకుల మీంచి వీచే గాలి - వెచ్చని వసంతాన్ని జ్ఞాపకం చేస్తోంది. అస్తమించేందుకు సిద్ధంగా వున్న సూర్యుడు - యీ ప్రదేశాన కాపురమున్న ఒంటరితనాన్ని ఇంకా చూపుతూ - మానవనీతిని బోధిస్తున్నాడు.

ఇరుగుపొరుగుల పిలుపులు లేకుండా, వార్తాప్రపంచానికి దూరంగా వుండి, ప్రేమించటాన్నే మరచిపోయినట్టు - కదలిక లేకండా భూభాగానికి అడుగున కాపురమున్న యీ ప్రజలతో నిండిన వీధుల్లో - నేను అటూ, ఇటూ తిరగసాగాను.

ఈ సమాధుల మీది సాహిత్యం - వినోదించ దగ్గదని నా అభిప్రాయం. ఒక్కొక్కచోట కడుపుబ్బ నవ్వుపుట్టించే రాతలుంటయ్. ఆ పాలరాతిమీద - చచ్చిన వ్యక్తికి సంబంధించిన బతికిన బంధువర్గం లిఖించే రాతలూ, పోయిన వ్యక్తి గుణగణాలూ, తమ విచారసూచక వాక్యాలూ, ఆ వ్యక్తి సౌఖ్యాన్ని కోరే ప్రార్థనలూ, ఎప్పటికైనా పోయిన వ్యక్తిని స్వర్గంలోనైనా కలుసుకోగలమనే వీళ్ళ ఆశా - ఎన్నో అర్థంలేని విషయాల మీద సాహిత్యం!

....ఈ వాటికలోని యీ ప్రదేశం చాలా పురాతనమైపోయింది. దీన్ని ఎవ్వరూ చూసేదిక్కులేకపోయినా - చచ్చినవారి సౌఖ్యంకోసం ప్రకృతి రకరకాల మొక్కల్నీ

మొలిపింపజేసింది. మానవశరీరపు ఎరువులతో పెరిగిన మొక్కలు కొట్టివేయబడి, త్వరలోనే ఇది ముందుచచ్చేవాళ్ళకోసం సిద్ధం చేయబడుతుంది.

ఈ రకం ఆలోచనల్తో నాకే విసుగెత్తింది. ఇది - కనపడని నా స్నేహితురాల్ని; విశ్వాసపూర్వకంగా దర్శించాల్సిన సమయమని తోచింది. భారమైన హృదయంతో ఆమె సమాధిని సమీపించాను. పాపం - ఆమె ఎంత మధురమైంది? ఎంత అందంగా, తెల్లగా, ఏమరిపాటున మరచిన కాంక్షను రెచ్చగొడుతూ, ఎంతప్రేమగా....ఇప్పుడు ఎవరైనా యీ సమాధిని తవ్వితే...?

ఆ సమాధి మీద కూర్చొని నా దుఃఖాన్నంతటిని గొణిగాను; కాని ఆమె వినగలిగిందనుకోను...ఇంటికి వెళ్దామని లేచాను...

పక్కసమాధిదగ్గర మోకరించి ఒకామె బాధాకరంగా ఏడుస్తోంది. ఆమె ముఖాన్ని మూసుకొని, ఒక శిలా ప్రతిమలాగు మోకరించి, ఆ మూసిన కళ్ళల్లో కన్పించే చీకట్లో, గతించిన విషయాల్ని కాబోలు తలుచుకుంటూ - చచ్చినవారి కోసం ఏడ్చే యీమెకూడా, ఆ చావుయొక్క భయంకరతను ఆ సన్నని గొంతుకలో చూపుతోంది. గాలి వల్ల వంగిన లేత మొక్కలాగు - ఆమె వంగింది; ఆ ఏడ్పు అంత పెద్దది కాకపోయినా, అందులో జీవితపు బాధ ఎంతో ఇమిడి వుంది. ఆ బాధ ఆమె భుజాలనూ, మెడనూ - శరీరాన్నే - ఎక్కువగా కదిలిస్తోంది....ఉన్నట్టుండి, ఆమె ముఖానికి అడ్డం వున్న చేతుల్ని తీసేసింది. ఇప్పుడే పెద్దనిద్దురనుంచి హఠాత్తుగా లేచినట్టు, మెల్లిగా రెండు కళ్లను పెద్దవిగా పిచ్చిగా తెరిచింది. ఆ కళ్ళచుట్టూ కూడుకున్న కన్నీటి బిందువుల మధ్య - ఎంతో అందంగా వున్నయ్. నేను తనవైపు చూస్తున్నట్టు తనిప్పుడే గ్రహించి సిగ్గుపడుతూన్నట్టు, మళ్ళీ తన ముఖాన్ని అరచేతుల్లో దాచుకుంది.

తరువాత ఆమె కాస్త పెద్దగా దుఃఖిస్తూ ఒణికేతలతో క్రమంగా కిందికి ఒంగుతూ, చివరకు తలను సమాధిపైన ఆనించింది. ఆమె కప్పుకున్న సన్నని పెద్ద బట్ట - ఆమె ప్రియుడు దాగున్న ఆ సమాధి ముందు భాగాన్నంతట్నీ ఆక్రమించుకుంది.

ఆమె మూలగటం విన్నాను. ఆమె ఒళ్లు తెలియని స్థితిలో కదలకుండా, ఒక చెంపను ఆనించి పడివుండటాన్ని కూడా గమనించాను. వెంటనే ఆమెకు సహాయం చెయ్యాల్సిన నా విధి జ్ఞాపకం వచ్చింది. ఆమె చేతుల్ని ఊపి, మూసి వున్న ఆమె రెప్పల మీద గట్టిగా ఊదాను; ఇదిచేస్తూ ఆ సమాధిపైన రాసిన విషయాన్ని కూడా చదివాను:

"ఇక్కడ టాన్‌కిన్ యుద్ధంలో తన ప్రాణాల్ని అర్పించిన కాప్టెన్ లూయియా ఉన్నాడు. అతని ఆత్మశాంతికోసం మా హృదయపూర్వక ప్రార్థనలు-"

దానిమీది తారీకు రెండునెలల కిందటిది. నాక్కూడా కళ్ళనీళ్ళపర్యంతమూ వచ్చి, నేను చెయ్యదల్చుకున్న సహాయాన్ని రెట్టించాను నా సేవతో ఆమెకు తెలివి వచ్చింది.

ఆమె మొదటిచూపు - యీ నలభైఏళ్ళ అందగాడికీ కృతజ్ఞతాపూర్వకంగా తోచింది. ఎక్కువ కన్నీళ్లతోను, దుఃఖంతోనూ తెంచబడే మాటల్తో ఆమె తన కథను చెప్పింది. వివాహమైన సంవత్సరానికే ఆ భర్త యుద్ధంలో చనిపోయాడట! ఆమె తల్లిదండ్రులు లేని బిడ్డగా పెరిగినా, ఆస్తిరూపాన ఆమె దగ్గర యేమిలేకపోయినా, ప్రేమకోసమే ఆ కాప్టెన్‌గారు తనను వివాహమాడారట!

ఆమెను చేతనైనంతవరకూ ఓదార్చుతూ చాలాసార్లు ఆమెను నేలమీది నుంచి లేపాలని ప్రయత్నించి, చివరకు అన్నాను: "మీరిక్కడ ఉండకూడదు - వచ్చెయ్యండి."

"నేను నడవలేను-" అని ఆమె గొణిగింది.

"నన్ను ఆధారంగా తీసుకోండి."

"మీరు నా మీద చాలా దయచూపుతున్నారు. మీరుకూడా ఎవరి కోసమన్నా దుఃఖిద్దామనే ఇక్కడికి వచ్చారా?"

"అవును..."

"స్త్రీయా?"

"ఊఁ!"

"మీ భార్యా?"

"కాదు... స్నేహితురాలు."

"స్నేహితురాలు కూడా భార్యంత ప్రియమైనదీ కావచ్చు: ఉద్రేకానికి కట్టలుండవు."

"నిజమే!"

మేమిద్దరమూ శ్మశానంలోంచి నడవసాగాము. ఆమె తన బరువునంతా నా మీదనే వెయ్యటంవల్ల నేను ఆమెను దాదాపు మొయ్యాల్సి వచ్చింది. చర్చి గేటు సమీపించేప్పటికి ఆమె సగం స్మృతి తప్పినట్టుంది.

"నాకు మూర్ఛవచ్చేట్టుంది" అంది మెల్లిగా.

"దగ్గరున్న హొటల్‌లో ఏదన్నా డ్రింక్ తీసుకోకూడదా?"

"అది...మంచిదే."

బతికివున్న యీ ప్రజలు - చచ్చిన తమ ప్రియబాంధవులకు విధిగా చూపాల్సిన యీ నిరుత్సాహకరమైన విధితో అలసి సేదదీర్చుకొనేందుకు, యీ చర్చికి దగ్గరగానే ఒకచిన్న హోటల్ సిద్ధంగా వుంది. ఆమెను అక్కడికి తీసుకువెళ్ళాను. ఒక కప్పు వేడి టీ తాగాక ఆమె కొంచెం తేరుకుంది. ఆమె పెదవుల పైన సన్నని నవ్వు తాండ విస్తూండగా, ఆమె తనను గూర్చి నాతో చెప్పసాగింది: "జీవితంలో ఒంటరిగా బతకటం ఎంత కష్టం! ఒక ఇంట్లో రాత్రింబగళ్లు తోడు లేకుండా గడపటం - నమ్మేందుకైనా

యీ ప్రపంచంలో లెక్కకు ఒక్కరైనా లేకపోవటం - అనురాగాన్నీ, సానుభూతినీ తీసుకునేందుకు కానీ, ఇచ్చేందుకు కానీ, ఎవ్వరూ లేకపోవటం ఎంత ఘోరం!" ఆమె దుఃఖంతో, అందమైన పెదవుల కదలికతో హృదయపు అగాధాల్లోంచి యీ మాటల్ని చెప్తూంటే, నా హృదయం ఒణికింది.

ఆమె ఇరవై సంవత్సరాల అందమైన యువతి ఐనందుకు, ఆమె సౌందర్యాన్ని పొగిడాను. ఆమె నా మాటల్ని అంగీకరిస్తూన్నట్టు తల వూపి నవ్వింది...కాస్త పొద్దుపోవటంవల్ల ఆమెను ఇంటిదగ్గర దిగవిడిచి వెళ్తానన్నాను. ఆమె దీనికి ఒప్పుకుంది. బండిలో ఇద్దరమూ దగ్గరగా ఒకళ్ళకొకళ్ళం ఆనుకొని కూర్చున్నాం. మా దేహాల్లోని వేడి, గుడ్డల్ని కూడా లెక్క చెయ్యకుండా కలుస్తూ - లోకంలో తమాషాగా కలతపెట్టే స్పర్శల్లో ఒకటైంది.

బండి ఆమె ఇంటి ముందు ఆగగానే పొగడటం ఆమెవంతయింది.

"నేను నాలుగో అంతస్తులో ఉంటున్నాను. మీరు నామీద చాలా దయ చూపారు. మీకు శ్రమకాకుంటే నాతోపాటు గది వాకిటిదాకా వస్తారా?"

నేను ఇందుకు ఒప్పుకున్నాను. కష్టంగా శ్వాస పీలుస్తూ నీరసంగా మెట్లు ఎక్కసాగింది. గదివాకిలి సమీపించగానే ఆమె అంది: "చాలా శ్రమ పెట్టాను. కాస్సేపు కూర్చొని వెళ్ళండి."

ఈ ఆహ్వానాన్ని కూడా అంగీకరించాను. అది బీదగదైనా చక్కగా శుభ్రంగా మంచి అభిరుచుల్ని తెలియపరిచే సామానుతో అలంకరింపబడింది. ఒకే చిన్న సోఫా మీద ఇద్దరమూ కూర్చున్నాం. ఆమె తన ఒంటరి జీవితాన్ని గూర్చి మళ్ళీ చెప్పసాగింది.

తరువాత నాకోసం కొన్ని ఫలహారాల్ని తెమ్మనేందుకు దాసీదాన్ని కాబోలు - కేక వేసింది; కాని ఆమె పిలుపుకు ఎవ్వరూ సమాధానం ఇవ్వలేదు. దాసీది వట్టిసోమరిదనీ, ఉదయం వస్తే సాయంత్రం నాగా పెడుతూంటుందనీ - ఆమె చెప్పింది.

ఆమె టోపీతీసి అవతల పెట్టింది. ఆమె నిజంగా చాలా అందమైనది! మెరిసే ఆమె కళ్లు - మానవుడికి శక్యంకాని శక్తితో నన్ను ఆకర్షించినయ్ - ఆ ఉద్రేకంలో ఆమెను రెండుచేతుల్లోకి లాక్కొని ఆ అందమైన ముఖమంతటా ముద్దు పెట్టుకోసాగాను. ఆమె నా నుంచి తప్పించుకోవాలని ప్రయత్నిస్తూ, "...తరువాత ఏమిటో నాకు అర్థమవటంలేదు-" అంది.

ఆమె మాటల్ని ఎలా అర్థం చేసుకునేది? ఆ మాటలు ద్వంద్వార్థంలో ఉన్నయ్. ఆమెను మౌనంగా వుంచాలని, నా దృష్టిని ఆమె పెదవుల మీదికి పోనిచ్చాను.... నాకు తోచిన అర్థాల్లోకల్లా మంచి అర్థాన్ని తీసుకొని ఆమె ప్రశ్నను సమాధాన పరిచాను. ఆమె అంతగా పెనుగులాడలేదు...ఆమె కళ్ళల్లోకి చూశాను. ఆమె గతించిన భర్తకోసం పడ్డ బాధా శ్రమా మాయమైనట్టు, ఆమె ముఖమే చెప్తోంది.

నా ప్రియుడిపాత్ర పూర్తికాగానే, "నువ్వు మామూలుగా ఎక్కడ భోం చేస్తావ్?" అని అడిగాను.

"ఈ వీధిమూలవున్న చిన్న హోటల్లో."

"ఒక్కతెవేనా?"

"అవును...ఎందుకూ?"

"ఇవ్వాళ నువ్వు నాతోపాటే భోంచెయ్యాలి."

"ఎక్కడ?"

"బజార్లో ఒక పెద్దహోటల్లో."

ఆమె మొదట దీనికి ఒప్పుకోలేదు. నేను బలవంతపెట్టాక, ఆమెలొంగి, "అది చాలా విలువైన జీవితం?" అని గొణిగింది.

"బట్టలు మార్చుకొస్తాను" అని ఆమె పడకగదిలోకి వెళ్ళి కాసేపటికి తిరిగి వచ్చింది. ఈసారి బూడిదరంగు చౌకబారు గౌను తొడుక్కొని, విచారకరంగా వచ్చింది. ఇది చూశాక ఆమెకు రెండేజతల బట్టలున్నయ్యనీ, ఒకటి బజారుకూ, ఇంకోటి శ్మశానానికీ ఉపయోగిస్తోందనీ – అర్థమైంది.

భోజన సమయంలో మాస్నేహం వృద్ధయింది. కొద్దిగా తాగాక హాయితో కూడిన సంతోషం ఆమెలో కన్పించింది. ఆమెతో పాటే ఇంటికి వెళ్ళాను.

శ్మశానంలో కలిసిన మాస్నేహం మూడువారాలవరకూ దినదినాభివృద్ధయింది. కాని కాలం సాగుతూన్నకొద్దీ ప్రతివస్తువుమీది విలువా తగ్గుతూంటుంది; ఇది స్త్రీల విషయంలో మరీ తొందరగా పనిచేస్తుంది. ఏదో అత్యవసరమైన పెద్ద ప్రయాణపు వంకమీద ఆమెను వదిలించుకున్నాను. నేను చూపిన దయకు నన్ను గొప్పగా అభినందించి, మళ్ళీ పారిస్‌వస్తే తనను తప్పక కలుసుకుంటానని వొట్లు వేయించుకొని కాని వదలలేదు; నేనంటే ఆమెకు ఎంత ఇష్టమో?

ఒక నెలదాకా ఆమెను కలుసుకోవాలనే వాంఛే కలగలేదు; కాని ఆమెను నేను మరిచిపోలేదు. ఆమెను తలిచినప్పుడల్లా ఏదో గొప్పరహస్యం – మనస్తత్వానికి సంబంధించిన సమస్యలాటిది – నన్ను బాధించేది. ఏ కారణం వల్లనో తెలియదు కాని, ఆమెను మళ్ళీ శ్మశానంలో చూడగలుగుతాననే ధైర్యం నాకు వుండేది; అందుకనే పూర్వంకన్న ఎక్కువగా శ్మశానానికి వెళ్తూండేవాణ్ణి. అటూ ఇటూ తిరుగుతూ చచ్చినవారితోడి సంబంధాన్ని ఇంకా పూర్తిగా వదులుకోలేని మామూలు మనుషులు దుఃఖించటాన్ని గమనించేవాణ్ని. టాంకిన్ యుద్ధంలో పోయిన కాప్టెన్ గారి సమాధీమీద పువ్వులేమి ఉండేవి కాదు; అతనికోసం ఏడ్చే వాళ్ళు కూడా నాకంటపడటంలేదు.

ఆ శ్మశానంలోని ఇంకో భాగంలో తిరుగులాడుతూండగా ఒక పురుషుడు, దుఃఖిస్తూన్న స్త్రీతో నావైపే వస్తున్నాడు. వారు నన్ను సమీపించగానే గుర్తించాను... ఆశ్చర్యం; ఆమె - ఆనాటి శ్మశాన సుందరే! నన్ను చూడగానే ఆమె ముఖం వెలవెలపోయింది. నేను అక్కడే నిలబడిపొయ్యాను. ఆ కనురెప్పతో, ఆమె 'నాకు ద్రోహం చెయ్యవోక - తరువాత వచ్చి నన్ను కలుసుకుంటావ్ కదూ?' అన్నట్టు సౌజ్ఞ చేసింది.

ఆమెతో ఉన్న పురుషుడు ఒక పెద్ద రాజోద్యోగి. అతని వయస్సు యాభై ఏళ్ళయినా, మనిషిలో అంత యీడు కన్పించదు. అతను పేరు గలవాడు. ఆమె పూర్వం నా చేతులపైన ఆనినట్టే - ఇప్పుడు అతని మీద ఆనింది. ఈ దృశ్యం నామీద బాగా పనిచేసింది. ఆశ్చర్యంతోనే శ్మశానాన్ని వదిలాను-

పురుషుల వేటకోసం శ్మశానాన్ని ఎన్నుకున్న యీమెను ఎలా అర్థం చేసుకోవాలో? ఆమె బజారుపిల్లా? పోయిన భార్యకోసమో, ప్రియురాలికోసమో దుఃఖిస్తూ, ఆమె సుఖస్పర్శనూ ఇంకా మరిచిపోలేక సంతాపించ పురుషుల్ని శ్మశానంలోనే ఆకర్షించ గలగటమే ఆమె గురా? బతికిన జనం తిరుగులాడే వీధులకన్న యీ చచ్చిన జనం హాయిగా కదలకుండా నివసించే వీధులే బాగున్నయ్యా? లేక గొప్పవేదాంతాన్ని జీవితంలో అతికష్టంమీద గ్రహించి, ఆ ఆనందంతో కూడిన అభివందనాల్ని సంపాయించాలనే ఆమె బయలుదేరిందా?...ఏమైనా యీ రెండోసారి ఆమె ఏ మహానుభావుడికి విధవయిందో తెలియనేలేదు!